సాక్షి
వనపర్తి
బుధవారం : 5 : ఫిబ్రవరి : 2025



గంగాపురం.. జనసంద్రం

గంగాపురం చెన్నకేశవస్వామి రథోత్సవానికి వివిధ ప్రాంతాల భక్తులు భారీ తరలివచ్చారు.

వివరాలు 8లో ▸



జములమ్మ ఉత్సవాలు

జమ్మిచేడు జములమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.0/15.9

చలి తీవ్రత తగ్గుముఖం పట్టింది. మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపిస్తుంది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 475 క్యూసెక్కుల వరద వస్తుండగా.. సమాంతర కాల్వ నుంచి నీటి నిలిపివేశారని వివరించారు. ఎన్టీఆర్ కాల్వకు 40 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 95, వివిధ ఎత్తిపోతల పథకాలకు 110, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

శ్రీశైలం జలాశయంలో తగ్గుముఖం..



దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో క్రమంగా నీటిమట్టం తగ్గుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 215.8070 టీఎంసీలు కాగా.. మంగళవారం సాయంత్రం వరకు 852.4 అడుగుల వద్ద 85.5689 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది. ప్రస్తుతం ఉన్న 85 టీఎంసీల నీటినే మరో 5 నెలలపాటు ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. అయితే ఎండలు ముదిరితే నీటిమట్టం మరింత వేగంగా తగ్గిపోయే ప్రమాదం లేకపోలేదు. గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 2,600 క్యూసెక్కులు, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,585, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 2,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 3.295 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

శుభకార్యాలకు అద్దె ప్రాతిపదికన బస్సులు

● రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: వివాహాది శుభకార్యాలకు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సులు అందజేస్తామని రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రీజియన్‌లో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను అద్దెకు తీసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి కిలోమీటర్‌పై గతంలో కంటే రూ.7 తగ్గింపు అని, 6 గంటల వెయింటింగ్ చార్జి మినహాయింపు ఉంటుందన్నారు. ప్రైవేట్ వాహనాల కన్నా తక్కువ ధరలు అని తెలిపారు. డ్రైవర్ బత్తా కట్టనవసరం లేదని, సౌకర్యవంతమైన బీఎస్-6 అధునాతన టెక్నాలజీ ఉన్న కొత్త బస్సులు, చెప్పిన చోట నుంచి ఎక్కడికైనా, ఎన్ని గంటలైనా అద్దెకు తీసుకోవచ్చని తెలిపారు. బస్సులను బుకింగ్ చేసుకోవడానికి డిపోల వారీగా అచ్చంపేట – 99592 26291, గద్వాల – 99592 26290, కల్వకుర్తి – 99592 26292, కొల్లాపూర్ – 90004 05878, కోస్గి – 99592 26293, మహబూబ్‌నగర్ – 99592 26286, నాగర్‌కర్నూల్ – 99592 26288, నారాయణపేట – 99592 26293, షాద్‌నగర్ – 99592 26287, వనపర్తి – 99592 26289 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ముగ్గురికి ఏఎస్‌ఐలుగా పదోన్నతి

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ముగ్గురు హెడ్‌కానిస్టేబుల్స్‌కు ఏఎస్‌ఐలుగా పదోన్నతి కల్పిస్తూ మంగళవారం జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి తర్వాత ముగ్గురికి వేరే చోట్ల పోస్టింగ్ ఇచ్చారు. ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన వారిలో ఎస్.శ్రీనివాసులు(మహబూబ్‌నగర్), లచ్చునాయక్ (నాగర్‌కర్నూల్), ఏ.ప్రేమ్‌కుమార్(గద్వాల)లకు పదోన్నతి కల్పించారు.

లైసెన్స్ లేని వ్యాపారం!

పురపాలికల్లో దుకాణాల లెక్కలు కరువు



జిల్లాకేంద్రంలోని ఓ దుకాణ సముదాయం

● రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతున్న వైనం
● ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, వసూళ్లపై దృష్టి సారించని అధికారులు

వనపర్తిటౌన్: పురపాలికల్లో ట్రేడ్ లైసెన్స్ రూపంలో రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో ఏళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. ప్రస్తుతం పురపాలికల్లో ఏయే విభాగంలో ఎన్ని దుకాణాలు ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. వనపర్తి పురపాలికలో అధికారుల లెక్కల ప్రకారం 2021 సంవత్సరంలో కొత్తవి, రెన్యూవల్ మొత్తం 700లోపు చూపించడం గమనార్హం. కిరాణం, బేకరి, ఆటోమొబైల్, హోటళ్లు, మద్యం, కార్పెంటర్, ఎలక్ట్రికల్, ప్లైవుడ్, పెయింటింగ్, వస్త్ర, ఐరన్, ఆస్పత్రులు తదితర దుకాణదారులు విధిగా పురపాలిక నుంచి లైసెన్స్ తీసుకోవాలి. కానీ అధికారుల పర్యవేక్షణ కొరవడంతో ఎలాంటి అనుమతులు లేకుండానే వ్యాపారాలు కొనసాగిస్తుండటంతో పురపాలికల ఆదాయానికి భారీగా గండిపడుతోంది. అధికారుల లెక్కల ప్రకారం 2021–22 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో అన్ని పురపాలికల్లో మొత్తం 5,419 దుకాణాలు ఉండగా.. అందులో 3,749 దుకాణదారులు లైసెన్స్ లేకుండా, 1,670 దుకాణదారులు లైసెన్స్‌లు కలిగి ఉండి వ్యాపారాలు కొనసాగిస్తున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం బకాయిలు ఉన్న దుకాణదారులు, ఎంత లక్ష్యం ఉందనే వివరాలు అధికారుల వద్ద లేవు. దీనిపై కలెక్టర్, ప్రత్యేక అధికారులు దృష్టి సారిస్తేనే పరిస్థితి మెరుగుపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అన్ని పురపాలికల్లో కలిపి ఏడాదికి సుమారు రూ.1.50 కోట్లకుపైగా వసూలు కావాల్సి ఉండగా.. కేవలం రూ.15 లక్షలలోపు ఆదాయం సమకూరుతుంది. ఏటా ఆస్తి, కొళాయి పన్ను వసూళ్లపై దృష్టి సారిస్తున్న అధికారులు ట్రేడ్ లైసెన్స్ రుసుం వసూళ్లను పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఏటా ఆస్తి, కొళాయి పన్నుల ఆదాయం కొంత పెరుగుతున్నా.. ట్రేడ్ లైసెన్స్‌లు మాత్రం పెరగడం లేదు. గతంలో ఏ ఏడాది ఎంత ఆదాయం వచ్చిందో వివరాలు సైతం లేవు. ప్రస్తుతం వనపర్తిలో వివిధ రకాల దుకాణాలు నాలుగు వేల వరకు ఉండగా.. 700లోపే లైసెన్స్ పొందినట్లు ప్రచారం జరుగుతోంది. గుర్తించిన దుకాణాల ప్రకారం పక్కాగా వసూలు చేస్తే రాబడి రూ.కోటి దాటుతుందని పుర పెద్దలు పేర్కొంటున్నారు.

కచ్చితంగా వసూలు చేస్తాం..



దుకాణదారులు కచ్చితంగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి లైసెన్స్ ఫీజు వసూలుకు చర్యలు చేపట్టాం. వ్యాపారులు పుర సిబ్బంది చేతికి డబ్బులు ఇవ్వకుండా ఆన్‌లైన్ చెల్లింపులు చేయాలి. లైసెన్స్ లేని దుకాణదారులకు నోటీసులు జారీ చేస్తాం. అప్పటికీ పరిస్థితిలో మార్పు రాకుంటే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం. ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా పురపాలికకు ఆదాయన్ని సమకూర్చుకుంటాం.

– ఉమామహేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వనపర్తి

మొండికేస్తున్న వ్యాపారులు..

రాజకీయ పలుకుడి, వ్యాపార సంఘాలకు ప్రాతినిథ్యం వహించే దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్ రుసుం చెల్లించేందుకు మొండికేస్తున్నారని పుర అధికారులు పేర్కొంటున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో తమను లెక్కచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇవీ నిబంధనలు..

పురపాలికలో కొత్తగా దుకాణం ఏర్పాటు చేసుకోవాలంటే ఆ శాఖ నుంచి అనుమతి తీసుకొని ట్రేడ్ లైసెన్స్ పొందాలి. లైసెన్స్ ఉన్న వారు ఏడాదికోసారి పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. ప్రాంతం, సైజ్, వ్యాపారం ఆధారంగా ప్రతి అడుగుకు నిర్ణీత రుసుం విధిస్తారు. అందుకు అనుగుణంగానే లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధానంతో పురపాలికకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. టీ స్టాల్ మొదలు బార్ అండ్ రెస్టారెంట్లు, ఫంక్షన్‌హాళ్లు, పెట్రోల్‌బంకుల వరకు వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా ఏ అధికారి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ప్రతి ఏటా ట్రేడ్ లైసెన్స్ రుసుం రూ.లక్షల్లో వసూలు కావాల్సి ఉన్నప్పటికీ సగం కూడా రావడం లేదు. చాలాచోట్ల ఎలాంటి లైసెన్స్‌లు తీసుకోకుండానే కొత్త దుకాణాలు ఏర్పాటవుతున్నా.. పుర అధికారులు దృష్టి సారించడం లేదు. లైసెన్స్ రుసుం చెల్లించేందుకు ముందుకొచ్చిన వారి నుంచే అధికారులు వసూలు చేస్తున్నారు.

బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలి



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

● కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించుకొని జాబితా సమర్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గోపాల్‌పేట మండలం జింకల బీడుతండా గెజిట్‌లో ఖిల్లాఘనపురం మండలంలో నిదిగా పేర్కొనగా సవరించినట్లు వివరించారు. అదేవిధంగా కొత్తకోట మండలం కనిమెట్టలో 12 వార్డులుగా మార్చినట్లు చెప్పారు. ఇప్పటికే ఎలక్ట్రోల్స్ పంపిణీ చేశామని.. ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. మ్యాపింగ్‌కు సహకరించాలని, తమ పార్టీ నుంచి పోటీ చేసే వారి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో ముందుగానే సరి చూసుకోవాలని సూచించారు. జిల్లాలో 15 మండలాలు, 268 గ్రామపంచాయతీలు ఉండగా.. ఎంపీటీసీ స్థానాలు 133, జెడ్పీటీసీ స్థానాలు 15 ఉన్నాయని చెప్పారు. జిల్లాలో 2,436 వార్డులు.. 3,86,621 ఓటర్లు ఉన్నారని అందులో పురుషులు 1,92,465, స్త్రీలు 1,94,152, నలుగురు ఇతరులు ఉన్నట్లు వెల్లడించారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ నుంచి రాజేంద్రప్రసాద్, బీఆర్‌ఎస్ నుంచి గట్టు యాదవ్, జమీల్, బీజేపీ నుంచి కుమారస్వామి, సీపీఎం నుంచి పుట్టా ఆంజనేయులు, ఎంఐఎం నుంచి రహీం తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోలు, ఏఆర్వోలను గుర్తించాలి..

త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు ఆర్వోలు, ఏఆర్వోలను గుర్తించి వారికి శిక్షణనిచ్చి ఎన్నికలకు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం అనంతరం సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వివిధ బృందాల జాబితాను రూపొందించాలని కోరారు. ఆర్వోలు, ఏఆర్వోల శిక్షణ అనంతరం ప్రిసైడింగ్ అధికారులకు కూడా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ యాదయ్య, డీపీఓ సురేశ్‌కుమార్, డీఆర్డీఓ ఉమాదేవి, ఏఓ భానుప్రకాష్, తహసీల్దార్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాల వినియోగంతోనే మెరుగైన సమాజం

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రజని

వనపర్తి రూరల్: చట్టాల వినియోగంతోనే మెరుగైన సమాజం రూపుదిద్దుకుంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి వి.రజని అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దగూడెం శివారు మహాత్మా జ్యోతిబాపూలే మహిళా గురుకుల వ్యవసాయ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల కోసం అనేక చట్టాలు ఉన్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకొని పురోగమించాలని సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో పలు వర్గాల పేదలకు ఉచిత న్యాయసేవలు అందిస్తున్నామని తెలిపారు. సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని.. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ కౌన్సిల్ కృష్ణయ్య, కళాశాల సిబ్బంది, నిర్వాహకురాలు స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ న్యాయమూర్తి రజని

కొనసాగుతున్న ఇంటర్ ప్రయోగ పరీక్షలు



పరీక్ష కేంద్రంలో డీఐఈఓ ఎర్ర అంజయ్య

వనపర్తి విద్యావిభాగం: జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు రెండోరోజు మంగళవారం ప్రశాంతంగా కొనసాగాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు జరిగిన పరీక్షల్లో 93.57 శాతం, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు జరిగిన పరీక్షలకు 96.66 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు డీఐఈఓ ఎర్ర అంజయ్య తెలిపారు. ఉదయం జనరల్ విభాగంలో 820 మందికిగాను 802 మంది హాజరుకాగా.. 18 మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఒకేషనల్ విభాగంలో 784 మందికిగాను 699 మంది హాజరుకాగా.. 85 మంది రాలేదని తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం జనరల్ విభాగంలో 520 మందికిగాను 508 మంది హాజరుకాగా 12 మంది గైర్హాజరయ్యారని.. ఒకేషనల్ విభాగంలో 706 మందికిగాను 677 మంది హాజరుకాగా.. 29 మంది గైర్హాజరైనట్లు చెప్పారు.

వారం రోజుల్లో బోనస్ డబ్బులు



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

అమరచింత: వర్షాకాలం సీజన్ వరిధాన్యం కొనుగోలుకు సంబంధించిన బోనస్ డబ్బులను వారం లోగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ రెడ్యానాయక్‌ను ఆదేశించారు. ప్రభుత్వం త్వరితగతిన భూభారతిని అమలు చేయనున్నందున పెండింగ్ భూ సమస్యలను వేగంగా పూర్తి చేయాలని కోరారు. వానాకాలం సీజన్ వరి ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేసిన కేంద్రాల్లో రైతుల నుంచి జిల్లావ్యాప్తంగా 2,21,184 మెట్రిక్ టన్నులు సన్నరకం సేకరించామని.. వీటికిగాను రైతుల ఖాతాల్లో రూ.516 కోట్లు జమ చేసినట్లు వివరించారు. అదనంగా చెల్లించే బోనస్ డబ్బులు ఇప్పటి వరకు రూ.70 కోట్లు చెల్లించామని.. శనివారం వరకు మరో రూ.8 కోట్లు వచ్చాయని, మిగిలిన రూ.22 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయగానే వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. యాసంగికి సంబంధించి వ్యవసాయశాఖ ఇచ్చే ప్రణాళికతో ముందుకు సాగుతామని వెల్లడించారు. అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో వక్ఫ్, దేవాలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయనే ఫిర్యాదులు అందుతున్నాయని.. పరిశీలించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించామన్నారు. కొత్త రేషన్‌కార్డులకు 17 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ వెంకటయ్య, సిబ్బంది ఉన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈనెల 6వ తేదీన (గురువారం) మధ్యాహ్నం 3 గంటలకు ఉమ్మడి జిల్లా సీనియర్ పురుషుల సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు నాగరాజు, రాఘవేందర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లో ఈ నెల 8 నుంచి 10 వరకు రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ జరుగుతాయని పేర్కొన్నారు. మిగతా వివరాలకు 99590 16610 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కంది క్వింటా రూ.6,951

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన ఈ–టెండర్లలో కందుల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 6951, కనిష్టంగా రూ. 6823 గా ధరలు లభించాయి. సీజన్ లేకపోవడం వల్ల మార్కెట్‌కు కేవలం వంద బస్తాల కందులు అమ్మకానికి వచ్చాయి.

వికసిత్ భారత్ బడ్జెట్ : బీజేపీ

వనపర్తిటౌన్: కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారతావనే లక్ష్యంగా రూ.50 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని రాజీవ్ చౌక్‌లో కేంద్ర బడ్జెట్‌ను హర్షిస్తూ పార్టీ పట్టణశాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు, మహిళలు, యువతకు పెద్దపీట వేస్తూ బడ్జెట్ రూపొందించి ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టిందని కొనియాడారు. వేతన జీవులకు రూ.12 లక్షల వరకు పన్ను రాయితీ ఇవ్వడంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో 30 వేల మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పట్టణాభివృద్ధికి ఆశించిన రీతిలో నిధులు కేటాయించిందని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌తో దేశ ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకోనున్నాయని.. పర్యాటక అభివృద్ధిలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలు శోభాయమానంగా మారుతాయన్నారు. ప్రతి రంగానికి మేలు చేకూరేలా బడ్జెట్ రూపకల్పన జరగడంతోనే ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.శ్రీశైలం, ప్రభాకర్, రామన్‌గౌడ్, సీతారాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్దిరాజు, రాజశేఖర్‌గౌడ్, తిరుమల్లేష్, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మత్స్య పథకాలను వినియోగించుకోండి

● జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప

ఆత్మకూర్: మత్స్యకారులు జాతీయ మత్స్యసంపద యోజనను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప కోరారు. మంగళవారం మండలంలోని ఆరేపల్లిలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రమాదబీమా రూ.5 లక్షలతో పాటు ఎన్నోరకాల పథకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. జిల్లాలో 992 చెరువులు, 142 సంఘాలు, 13,600 మంది సభ్యులు ఉన్నారని.. సంక్షేమ పథకాల కోసం ఇప్పటి వరకు 2,800 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ ఏడాది పెద్ద చెరువుల్లో మాత్రమే 54 లక్షల చేప పిల్లలను వదిలామని.. అనివార్య కారణాలతో లక్ష్యానికి అనుగుణంగా సరైన సమయంలో చేపట్టలేకపోయామని చెప్పారు. మత్స్యకారులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా ఎన్ఎఫ్‌డీబీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ తరుపున గ్రామానికి చెందిన మత్స్యకారుడు ఏటికాడి ఆనంద్ రాష్ట్రపతి అవార్డు అందుకోవడం జిల్లాకే గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా ఆనంద్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు భరత్, వీరేశ్, శ్రవణ్, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చేప పిల్లల చెరువు వద్ద జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప తదితరులు



ఆలయం ఎదుట భక్తుల రద్దీ



షిడె కార్యక్రమానికి హాజరైన భక్తులు

ఘనంగా ఈదమ్మ షిడె ఉత్సవం

పాన్‌గల్: ఉమ్మడి జిల్లాలో పేరుగాంచిన మండల కేంద్రంలోని ఈదమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో జాతర ప్రాంగణమంతా జనసంద్రంగా మారింది. మహిళలు అందంగా అలంకరించిన బోనపు కుండలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి జూపల్లి తనయుడు జూపల్లి అరుణ్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. షిడె ఉత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు ఆటోలు, ట్రాక్టర్లలో తరలి వచ్చారు. షిడెకు గొర్రె పిల్లను కట్టి చుట్టూ తిప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ భారీగా భక్తులు తరలిరావడంతో ఏ మాత్రం సరిపోలేదు. దీంతో భక్తులు కొంత అసహనానికి గురయ్యారు. ఇదిలా ఉండగా జాతర మైదానంలో ఏర్పాటుచేసిన దుకాణాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా వనపర్తి సీఐ కృష్ణ, ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆరుగురు ఎస్ఐలు ,70 మంది పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, నాయకులు వెంకటేష్‌నాయుడు, రవికుమార్, రాము యాదవ్, పుల్లారావు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.



రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 71వ అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. పోటీల ప్రారంభోత్సవంలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న వనపర్తి జిల్లా క్రీడాకారులు

క్లుప్తంగా

శుభకార్యానికి వెళ్లి వస్తూ అనంత లోకాలకు..

- కల్వర్టును ఢీకొని కారు బోల్తా
- వివాహిత మృతి



పుష్పలత (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: శుభకార్యానికి వెళ్లి వస్తూ కల్వర్టును ఢీకొని కారు బోల్తా పడటంతో ఓ వివాహిత మృతిచెందిన ఘటన మండలంలోని చందుబట్ల గేటు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలు.. పెంట్లవెల్లి గ్రామానికి చెందిన భాస్కర్ రైస్‌మిల్లు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడు తన భార్య పుష్పలత(47) కూతురు భవానితో కలిసి హైదరాబాద్‌లో ఓ ఫంక్షన్‌కు వెళ్లి మంగళవారం తెల్లవారుజామున కారులో పెంట్లవెల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. చందుబట్ల గేటు వద్ద కారు కల్వర్టును ఢీకొని బోల్తాపడటంతో పుష్పలతకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి మార్చురీకి తరలించారు. మృతురాలి కుమారుడు రాఘవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ.4 లక్షలు చోరీ

నారాయణపేట: జిల్లాకేంద్రంలోని సెంటర్ చౌరస్తాలో మంగళవారం ఆపి ఉన్న ద్విచక్ర వాహనం నుంచి రూ.4 లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం మేరకు.. దామరగిద్ద మండలం కానుకుర్తికి చెందిన పూజారి నారాయణ జిల్లాకేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో రూ.4 లక్షల డ్రా చేసి బ్యాంకులో పెట్టుకొని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో సెంటర్‌చౌక్‌లో ఉన్న గోల్డెన్ బేకరి వద్ద వాహనాన్ని నిలిపి లోనికి వెళ్లి తినుబండారాలు కొనుగోలు చేశారు. అదే సమయంలో వాహనంపై బ్యాగులో దాచిన రూ.4 లక్షలను మరో బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. తమ బంధువుల పెళ్లికోసం తీసుకొచ్చిన డబ్బులని బాధితుడు తెలిపారు.

లేగదూడపై చిరుత దాడి

కోస్గి రూరల్: లేగదూడపై చిరుత దాడి చేసి చంపేసిన సంఘటన గుండుమాల్ గ్రామంలో చోటుచేసుకుంది. అటవీ శాఖాధికారి లక్ష్మణ్‌నాయక్ తెలిపిన వివరాలు.. గుండుమాల్‌కి చెందిన గుడిసె కుర్మయ్య సోమవారం రాత్రి తమ వ్యవసాయ పొలం వద్ద పశువుల కట్టేసి ఇంటి కొచ్చాడు. మంగళవారం ఉదయం పొలానికెళ్లి చూడగా లేగదూడపై చిరుత దాడిచేసి చంపేసింది. చుట్టుపక్కల వారి సహాయంతో ఫారెస్ట్ అధికారికి సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకొని పంచనామా నిర్వహించి లేగదూడపై చిరుత దాడి చేందని నివేదికను పైఅధికారులను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

హోంగార్డును అభినందించిన డీఐజీ



మహబూబ్‌నగర్ క్రైం: జోగుళాంబ జోన్ పరిధిలో ఉత్తమ విధులు నిర్వహించిన హోంగార్డు నర్సింహులను మంగళవారం జిల్లాకేంద్రంలో డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో హోంగార్డు సేవలు ఎంతో కీలకమన్నారు. నిబద్ధతతో విధులు నిర్వహించే హోంగార్డులను ప్రోత్సాహిస్తామన్నారు. ఇలాంటి ప్రత్యేక గుర్తింపు వల్ల వారిలో మరింత ఉత్సాహం అందిస్తుందన్నారు.

గంగాపురం.. జనసంద్రం

- గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయ పరిసరాలు



రథసప్తమి, రథోత్సవం సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రథసప్తమి, రథోత్సవం సందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. గ్రామ కూడళ్లు, ఆలయ పరిసరాలు చెన్నకేశవ, గోవింద నామస్మరణతో మార్మోగాయి. చెన్నకేశవా.. వచ్చామయ్యా అంటూ భక్తులు ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకోవడం కనిపించింది. పలువురు భక్తులు వ్రత మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, కొత్త కుండల్లో వంటలు చేసి దాసంగాలు సమర్పించారు. మరికొందరు తలనీలాలు సమర్పించి కోనేటిలో స్నానమాచరించి గండ దీపాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి మొక్కులు చెల్లించుకోగా.. పలువురు గోవులు సమర్పించారు. భక్తులు భారీగా తరలిరావడంతో స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో నిలబడాల్సి వచ్చింది.

- ఉదయం మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ఆలయానికి చేరుకోగా పాలకమండలి సభ్యులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

వైభవంగా రథోత్సవం..

మంగళవారం రాత్రి నిర్వహించిన రథోత్సవం శోభాయమానంగా సాగింది. రథాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. గ్రామ విశ్వబ్రాహ్మణుల ఇళ్లకు మేళతాళాలతో వెళ్లి ఆలయానికి ఆహ్వానించారు. అనంతరం బలిహరణం, హోమం జరిపించిన పండితులు అందంగా అలంకరించిన స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై ఉంచారు. విశ్వ బ్రాహ్మణులు రథానికి పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు గోవింద, చెన్నకేశవ నామస్మరణలతో ముందుకు లాగారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆలయ ప్రాంగణంలో నైవేద్యాలు తయారుచేస్తున్న భక్తులు



కోనేరు వద్ద భక్తులు

జములమ్మ ఉత్సవాలు ప్రారంభం

- నేడు మెట్టినింటికి చేరుకోనున్న అమ్మవారు
- ఆహ్వానం పలికేందుకు పుట్టినింటికి బయల్దేరిన ఎద్దులబండి



అలంకరణలో జములమ్మ అమ్మవారు

గద్వాల న్యూటౌన్: నడిగడ్డ ప్రజల ఇలవేల్పు జములమ్మ అమ్మవారి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మేళతాళాలు, డప్పుల మోతలు, వేలాదిగా తరలివచ్చిన భక్తుల సందడి ఆలయ పరిసరాల్లో కనిపించింది. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఆహ్వానించేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు ఆలయం నుంచి ఎద్దులబండి పుట్టిన ఊరైన గుర్రంగడ్డకు బయలుదేరింది. అంతకుముందు అర్చకులు ఆలయంలో, అమ్మవారి నాగపడిగకు సంప్రదాయ పూజలు జరిపించారు. అనంతరం నాగపడిగను పూజారులు తలపై ధరించి ఎద్దులబండిపై బయలుదేరారు. డప్పుల మోతలు, మేళతాళాలు, భక్తుల పూనకాల నడుమ ఊరేగింపు కొనసాగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఈఓ పురేందర్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అమ్మవారు బుధవారం ఉదయం 6 గంటలకు జమ్మిచేడులోని జములమ్మ ఆలయానికి చేరుకోనున్నారు.



నాగపడిగతో బయలుదేరిన అర్చకులు

రేవతిని అభినందించిన డీఎఫ్ఓ



ఢిల్లీలో రాష్ట్రపతికి అభివాదం చేస్తున్న చెంచులు (ఫైల్)

మన్ననూర్: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో మన్ననూర్ ఐటీడీఏ నుంచి చెంచు మహిళ కాట్రాజు రేవతి (కొండనాగుల) పాల్గొన్నారు. మంగళవారం తిరిగి గ్రామానికి చేరుకోగా ఐటీడీఏ ఇంచార్జ్ పీఓ, డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి ఐటీడీఏ కార్యాలయానికి పిలిపించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణతంత్ర వేడుకలకు అన్ని రాష్ట్రాల నుంచి సమాజం గురించి కొంత పరిజ్ఞానంతో పాటు సమాజసేవ చేస్తున్న చెంచులను పిలువడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ క్రమంలో మన్ననూర్ ఐటీడీఏ నుంచి కాట్రాజు రేవతి (కొండనాగుల), అదిలాబాద్ ఐటీడీఏ నుంచి కొలాం జాతికి చెందిన కేశవరావుకు అవకాశం దక్కిందని తెలిపారు. గత నెల 22న బయలుదేరిన వీరు గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం అక్కడే రాష్ట్రపతి భవన్‌లో విడిది ఏర్పాటు చేయడంతో పాటు పర్యాటక ప్రదేశాలను చూసే అవకాశం కల్పించారని, 12 రోజుల ప్రయాణం అనంతరం మంగళవారం స్వగ్రామాలకు చేరుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా అక్కడి విశేషాలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏఓ జాఫర్ హుస్సేన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే తొలి ప్రయత్నంగా 'సుద్దాల' ఉత్సవాలు

- తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు
- ప్రారంభించనున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలోనే తొలి ప్రయత్నంగా స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్న సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాలకు వేదికగా నిలుస్తున్నట్లు తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సుశ్రుత ప్రజా వైద్యశాలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైవిధ్య భరితమైన కార్యక్రమాలు లేనందున విద్యార్థుల్లో సృజనాత్మకత కొరవడిందన్నారు. ఈలోటును భర్తీ చేయడానికి ఇలాంటి వేదికలు ఎంతో అవసరమని అన్నారు. ఈమేరకు సాంస్కృతిక కమిటీ ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల వేదిక కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ అత్యున్నత విలువలను, కళల్ని యువతకు పరిచయం చేసేందుకే నేటినుంచి రెండు రోజులపాటు పది అంశాలపై సాంస్కృతిక కళా ప్రదర్శనలు, పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభిస్తారని, విజేతలకు ప్రముఖ సినీరచయిత సుద్దాల అశోక్‌తేజ బహుమతులు అందజేస్తారన్నారు. ఉత్సవాల వేదిక కమిటీ అధ్యక్షులు బెక్కం జనార్దన్ మాట్లాడుతూ పట్టణంలోని కళాశాల విద్యార్థులు, యువత, ప్రజలు ఈ సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉత్సవాల వేదిక కమిటీ ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, ఉపాధ్యక్షులు ఎం.కురుమయ్య పాల్గొన్నారు.

మద్యం, ధూమపానంతో పేగులకు హాని

- జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్
- ఐదుగురికి లాపరోటమీ సర్జరీలు



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, డాక్టర్ సునీల్

పాలమూరు: అధిక మోతాదులో మద్యం, సిగరేట్లు తాగడంతో పాటు దీర్ఘకాలికంగా అల్సర్ సమస్యలు ఉండటంతో పేగులకు హాని జరిగే అవకాశముందని జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ అన్నారు. ఆస్పత్రిలోని జనరల్ సర్జరీ విభాగం వైద్యబృందం ఐదుగురు రోగులకు అత్యవసర లాపరోటమీ సర్జరీ చేసిన నేపథ్యంలో ఆ వివరాలను ఆస్పత్రి సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. వనపర్తి జిల్లాలోని ఆత్మకూర్‌కు చెందిన చంద్ర, హన్వాడ మండలం కొత్తపేట్‌కు చెందిన మునిస్వామి, గండేడ్ మండలం గాదిరాలకు చెందిన తిప్పలయ్య, తిమ్మాజీపేట మండలం గొరిటాకు చెందిన ఆంజనేయులు, కొత్తకోట మండలం కానాయపల్లికి చెందిన మణెమ్మ అనే రోగులు పేగులకు రంధ్రం ఏర్పడి తీవ్ర కడుపునొప్పి, వాంతులు, ఇతర సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు. వేర్వేరు తేదీల్లో వీరు ఆస్పత్రిలో చేరగా వారిని పరీక్షించి ఆరోగ్యశ్రీ కింద లాపరోటమీ సర్జరీలు చేశారన్నారు. ఇదే సర్జరీలు బయట ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేస్తే ఒక్కొక్కరికి రూ.2లక్షలు ఖర్చు అవుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్, జనరల్ సర్జరీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ సునీల్, వైద్యులు వంశీ, జగన్‌మోహన్, రహీముద్దీన్, గాయత్రి, దీపుకుమార్, గోపాల్‌నాయక్, సాయిచరణ్, చక్రధర్, విజేత, సౌమ్య పాల్గొన్నారు.

'ఫిర్యాదు చేయడానికి వెళ్తే పోలీసులు కొట్టారు'



దెబ్బలను చూపుతున్న బాధితులు

కల్వకుర్తి టౌన్: ఇరు కుటుంబాల మధ్య గొడవ జరిగిన ఘటనపై ఫిర్యాదు చేయడానికి వస్తే పోలీసులు బాధితులను కొట్టిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి బాధితుల కథనం ప్రకారం.. కల్వకుర్తి మండలంలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన రెండు కుటుంబాల మధ్య సోమవారం సాయంత్రం పందుల విషయంలో గొడవ జరిగింది. గొడవలో ఒక కుటుంబం వారు మరో కుటుంబాన్ని దారుణంగా కొట్టగా, దాడి చేసిన కుటుంబంపై ఫిర్యాదు చేయడానికి మరో కుటుంబం వారు కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. దీంతో ఫిర్యాదు చేయడానికి వచ్చిన వెంకటయ్య, నిరంజన్, సత్తయ్యలను పోలీసులు కొట్టడంతో వారి శరీరంపై గాయాలయ్యాయి. దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేయడానికి వస్తే పోలీసులు ఇలా కొట్టడం ఏమిటని బంధువులు, గ్రామస్తులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు రావడంతో విషయం బయటకు వచ్చింది. తమను ఎందుకు కొట్టారని అడిగితే పోలీసులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని బాధితులు విలేకరులతో వాపోయారు. అకారణంగా తమను కొట్టిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



బాధిత కుటుంబ సభ్యులకు నచ్చచెబుతున్న పోలీసులు

పూడ్చిన శవం వెలికితీసి పోస్టుమార్టం



ఇందువాసి శ్మశానవాటికలో ఫోరెన్సిక్ అధికారులు, పోలీసులు

గట్టు : మండలంలోని ఇందువాసికి గ్రామంలో మంగళవారం పూడ్చిన శవాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. వివరాలు.. ఇందువాసికి చెందిన కుర్వ చిన్నవీరేష్(30) గతేడాది డిసెంబర్ 2న కర్ణాటకలోని రాయచూర్ జిల్లా జిలంగేరికి కూలి పనికెళ్లి మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుని తండ్రి వెంకటేష్ తన కొడుకు చిన్న వీరేష్ మృతిపై అనుమానం వ్యక్తంచేస్తూ జనవరి 17న గట్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మహబూబ్‌నగర్ నుంచి వచ్చిన ఫోరెన్సిక్ ప్రొఫెసర్లు, తహసీల్దార్ సలీముద్దీన్, ఎస్‌ఐ మల్లేష్‌ల సమక్షంలో పూడ్చి శవాన్ని బయటకు తీసి అక్కడే పోస్టుమార్టం చేసి పంచనామా నిర్వహించారు.

పండ్ల చోరీ.. ప్రాణాలు తీసింది

24 గంటల్లో దాడి కేసును ఛేదించిన పేట పోలీసులు

- నిందితుల అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ లింగయ్య



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట: దుకాణంలో పండ్లు చోరీకి పాల్పడుతున్న వ్యక్తిపై దాడి చేయడంతో మృతిచెందిన ఘటన కేసులు పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం డీఎస్పీ లింగయ్య విలేకరులకు వెల్లడించారు. రాజస్తాన్‌కు చెందిన విక్రమ్‌సింగ్, కారు, శివరాజ్ నాలుగేళ్ల క్రితం జీవనోపాధి కోసం మహబూబ్‌నగర్ వచ్చి టైల్స్ పనిచేసుకునేవారు. అయితే ఇటీవల విక్రమ్‌సింగ్, కారు నారాయణపేటలో టైల్స్ పనికోసం వచ్చారు. విక్రమ్‌సింగ్ సోమవారం తెల్లవారుజామున 3.25 గంటల సమయంలో పండ్ల దుకాణం దగ్గర అనుమానుతిడిగా కనిపిండంతో కాపు కాసిన మాదం బాలరాజు, చింత గోపి, దాసరి రాజు, గుర్మిట్కల్ నరేష్, ఎండీ రఫీలు కట్టెలతో దాడిచేశారు. దెబ్బలకు తాళలేక విక్రమ్‌సింగ్ స్పృహతప్పి పడిపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తీరా 9 గంటల ప్రాంతంలో పండ్ల వ్యాపారి గోపి వచ్చి యువకుడిని ఆటోలో తీసుకెళ్లి ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తుతెలియని యువకుడు గాయపడ్డాడని చేర్పించారు. అప్పటికే యువకుడు మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించడంతో ఆ విషయాన్ని మిగతా నలుగురికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి పారిపోవాలనుకున్నారు. అయితే విక్రమ్‌సింగ్ చనిపోయి ప్రభుత్వ ఆస్పత్రిలో డేడ్ బాడీ ఉందంటూ కారు అనే వ్యక్తి శివరాజ్‌కు చెప్పడంతో వెంటనే పేటకు చేరుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దొంగగా అనుమానించి..

బస్టాండ్ పక్కన గోపి అనే వ్యక్తి పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అయితే రాత్రి సమయంలో పండ్లు చోరీకి గురవుతుండటంతో సోమవారం రాత్రి కాపు కాశారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 3.25 గంటల ప్రాంతంలో విక్రమ్‌సింగ్ అనుమానాస్పదంగా తిరగడంతో దాడి చేయగా దెబ్బలకు తాళలేక మృతిచెందాడు. ఈ మేరకు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకొని సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం విచారణ చేపట్టి 24 గంటల్లో నిందితులను పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఐదుగురు నిందితులతో మృతుని చంపడానికి ఉపయోగించిన ఐరన్ పైపు, ప్లాస్టిక్ పైపు, కట్టెలు, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. 24 గంటల్లో కేసు ఛేదించిన సీఐ శివశంకర్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు రాములు, లింగమూర్తి, ఆంజనేయులును డీఎస్పీ అభినందించారు.

వరకట్న వేధింపు కేసులో వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష



యోగేష్ గౌతమ్, ఎస్పీ

నారాయణపేట: వరకట్న వేధింపులతో భార్య మృతికి కారణమైన భర్త మహేష్‌కుమార్‌కు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.25వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. వివరాలు.. నారాయణపేట మండలం సింగారం గ్రామానికి చెందిన భవాని(21)కి 2022 మే నెలలో కర్ణాటక రాష్ట్రం యాద్గిరి జిల్లాకు చెందిన మహేష్‌కుమార్‌తో వివాహం చేశారు. పెళ్లైన కొన్ని నెలలు భార్యాభర్తలు బాగానే ఉన్నారు. అనంతరం మహేష్‌కుమార్, అతని తల్లిదండ్రులు నారాయణ, పార్వతమ్మలు అదనపు కోసం వేధింపులకు గురిచేసేవారు. ఈవిషయాన్ని అప్పట్లో ఆమె తన అన్న భరత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సింగారం గ్రామానికి తీసుకొచ్చారు. కాగా పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి మాట్లాడిన వారిలో ఎలాంటి మార్పులేదు. దీంతో భవాని తన అన్న ఇంట్లో అందరూ నిద్రపోయాక మే 5, 2023న చీరతో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. భరత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి నారాయణపేట ఎస్‌ఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేయగా అప్పటి డీఎస్పీ సత్యనారాయణ దర్యాప్తు చేసి కోర్టు చార్జిషీట్ ఫైల్ చేశారు. ప్రస్తుత డీఎస్పీ నల్లపు లింగయ్య ఆదేశాల మేరకు, సీఐ శివకుమార్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, కోర్టు లైజనింగ్ అధికారి కృష్ణయ్యగౌడ్, కోర్టు డ్యూటీ అధికారులు విజయ్ కుమార్, ఏఎ మీర్జా బేగ్ సాక్షులకు సమాన్లు అందజేశారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ బాలప్ప వాదనలు వినిపించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా పీపీని, పోలీసు అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించారు.